సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 23 | మార్చి | 2025





## కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

ఆదిలాబాద్‌లోని సర్వేనంబర్ 72లో ఉంటున్న ఆదివాసీలకు మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో తుడుందెబ్బ చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. 8లో▸



## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| ఆదివారం : 6:24 | సోమవారం : 5:01 |

గరిష్ఠం/కనిష్ఠం
36.0/23.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

# స్టడీగా.. కొలువులు

• ఆత్మస్థైర్యం, సంకల్ప బలంతో సర్కారు జాబ్‌లు సాధిస్తున్న యువత • నిరుద్యోగులకు అండగా 'బీసీ స్టడీ సర్కిల్'

సండే స్పెషల్

సర్కారు కొలువే లక్ష్యం.. అకుంఠిత దీక్ష, అలుపెరగని పోరాటమే వారి ఆయుధాలు. 'ప్రయత్నం చేసి ఓడిపో.. కానీ ప్రయత్నం చేయకుండా ఓడిపోకు' అన్న వివేకానందుని మాటలు.. 'కల అంటే నిద్రలో వచ్చేది కాదు.. నిద్రపోనివ్వకుండా చేసేది' అన్న కలాం సంకల్ప స్ఫూర్తితో ముందుకు కదిలారు. కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని అనుక్షణం పుస్తకాలతో కుస్తీ పట్టారు. అపజయాలను అధిగమిస్తూనే అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ఆత్మస్థైర్యంతో అడుగులేస్తూ లక్ష్య సాధన వైపు కదిలారు. బీసీ స్టడీ సర్కిల్ దిక్సూచిగా విజయతీరానికి చేరువయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ముందున్న వారిపై ఈ వారం సండే స్పెషల్.

– ఆదిలాబాద్



జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ పెట్రోల్‌పంపు ఏరియా.. ప్రధాన రహదారి ఆనుకుని నిత్యం జనంతో రద్దీగా ఉండే ప్రాంతం. రణగొణ ధ్వనులతో గందరగోళంగా ఉంటుంది. అక్కడే ఓ కొలువుల కార్ఖానా ఉందండోయ్. లోనికి వెళితే మాత్రం అంతా నిశ్శబ్దమే. తలలు కనిపిస్తున్నా.. మాటలు వినిపించవు. ప్రతీ ఒక్కరి చేతిలో పుస్తకం.. పెన్ను. పక్కన ఓ వాటర్ బాటిల్. వారంతా అనుక్షణం అక్షరాలతో కుస్తీ పడతారు. సమయం చూడకుండా కలల కొలువు కోసం చెమటోడుస్తారు. శిక్షణ పొందుతూ నిత్యం పుస్తక ప్రపంచంలో మునిగితేలుతారు. ఎంతోమంది నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగం వైపు నడిపిస్తున్న ఆ శిక్షణ కేంద్రమే బీసీ స్టడీ సర్కిల్.



## ఉద్యోగాల.. ఉదయ్



కుటుంబ సభ్యులతో ఉదయ్

బజార్‌హత్నూర్ మండలకేంద్రానికి చెందిన బిట్లింగు లక్ష్మణ్‌- సరస్వతి దంపతుల కుమారుడు ఉదయ్ పోటీ పరీక్షలేవైనా తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగమే గగనమైన ప్రస్తుత తరుణంలో ఏకంగా ఎనిమిది కొలువులకు ఎంపికయ్యాడు. 2019లో వీఆర్వో ఫలితాల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించాడు. జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఫలితాల్లో ఏకంగా మొదటి ర్యాంకు సాధించాడు. ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్ ఫలితాల్లో ఐదోర్యాంకుతో సత్తాచాటాడు. ఎస్‌ఎస్సీ సీహెచ్‌ఎస్‌ఎల్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. 2023లో సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా సెలక్ట్ అయ్యాడు. 2024లో గ్రూప్‌–4 ఫలితాల్లో 11వ ర్యాంకు సాధించి ఆదిలాబాద్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రస్తుతం జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్‌–1 ఫలితాల్లో 360 మార్కులు సాధించగా, గ్రూప్‌–2లో రాష్ట్రస్థాయి 51వ ర్యాంకు, గ్రూప్‌–3లో 74వ ర్యాంకుతో సత్తా చాటాడు.

### ఐఏఎస్ నా లక్ష్యం..

2015లో బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశా. 2017 నుంచి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. అదే సంవత్సరం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అప్పటి ఐఏఎస్ అధికారులు బి. గోపి, వల్లూరి క్రాంతిల చొరవతో కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి పది మందిని హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్ సెంటర్లో జాయిన్ చేశారు. అందులో నేను కూడా ఉన్నాను. అక్కడ ఏడాది పాటు శిక్షణ తీసుకున్నా. అనంతరం ఇక్కడికి వచ్చా. అప్పటి నుంచి స్టడీ సర్కిల్‌లో రెగ్యులర్‌గా ప్రిపేరవుతున్నా. అధ్యాపకుల గైడెన్స్ ఉపకరించింది. గ్రూప్‌–1లో మెరిట్ ఉన్నా గ్రూప్ 2, గ్రూప్‌–3లలో తప్పకుండా ఉద్యోగం వచ్చే అవకాశాలు ఉన్నాయి. నా తదుపరి లక్ష్యం సివిల్స్. ఆ దిశగా ప్రిపరేషన్ కొనసాగిస్తున్నా. - ఉదయ్



జేఎల్ నియామక పత్రం అందుకుంటున్న వినోద్ (ఫైల్)

## పట్టు వదలని.. వినోద్

జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన ధీకొండవార్ అశోక్‌–లక్ష్మీ దంపతుల కుమారుడు వినోద్ ఇప్పటివరకు మూడు ప్రభుత్వ కొలువులు సాధించాడు. ఓయూలో ఎంఏ హిందీ పూర్తి చేసిన తర్వాత పోటీ పరీక్షల వైపు దృష్టి సారించాడు. 2015లో నెట్ క్వాలిఫై అయ్యాడు. రెండేళ్ల పాటు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేశాడు. తర్వాత గురుకుల నియామక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పీజీటీ, టీజీటీ (హిందీ) ఉద్యోగాలను సాధించాడు. 2023లో జూనియర్ లెక్చరర్ పరీక్ష రాసి, ఈ ఏడాది వెలువడిన ఫలితాల్లో కొలువు దక్కించుకున్నాడు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేఎల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

### నిరుద్యోగులకు వరం..స్టడీ సర్కిల్

నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ ఓ వరం. నేను రెండేళ్ల పాటు అక్కడే ప్రిపరేషన్ కొనసాగించా. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు చదువుకోవచ్చు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. సిబ్బంది సహకారం, మోటివేషన్ బాగుంటుంది. నా విజయంలో స్టడీ సర్కిల్ పాత్ర కూడా ఉంది.

– వినోద్, రాంనగర్, ఆదిలాబాద్

## పేదరికాన్ని జయించిన నగేశ్



కుటుంబసభ్యులతో నగేశ్

తాంసి మండల కేంద్రానికి చెందిన బెల్లపు దేవిదాస్‌–లక్ష్మి దంపతుల కుమారుడు నగేష్ పేదరికాన్ని ఎదిరించి ప్రభుత్వ కొలువులు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఓయూలో ఎమ్మెస్సీ (జువాలజీ), బీఎడ్ పూర్తి చేశాడు. 2017 నుంచి తన ప్రిపరేషన్ షురూ చేశాడు. ఈ క్రమంలో 2021లో మధ్యప్రదేశ్‌లోని సైనిక్ స్కూల్లో పీజీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. అక్కడ విధులు నిర్వర్తిస్తూనే ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ అధికారుల ప్రోత్సాహంతో ప్రిపరేషన్ సాగించాడు. ఫలితంగా గురుకుల పీజీటీ (బయో)లో రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు సాధించాడు. అలాగే జూనియర్ లెక్చరర్ (జువాలజీ)లో 3వ ర్యాంకు, డిగ్రీ లెక్చరర్‌గా 5వ ర్యాంకు సాధించాడు. 2024 జూలైలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేరాడు. ఇటీవల విడుదలైన జేఎల్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు వచ్చింది. జిల్లాలోనే పోస్టింగ్ దక్కింది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే విధులు నిర్వహిస్తున్నాడు.

### సంకల్ప బలమే ఆయుధం

నేను మధ్యప్రదేశ్ సైనిక్ స్కూల్‌లో పీజీటీగా విధులు నిర్వర్తిస్తూనే ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ అధికారుల ప్రోత్సాహంతో ప్రత్యేకంగా మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నా. ఆన్‌లైన్ క్లాసులు విని సన్నద్ధత కొనసాగించా.శ్రమను నమ్ముకుంటే విజయం వరిస్తుంది. అందుకు నేనే ఉదాహరణ. డిగ్రీలో ఉండగా కూలీ పనులకు కూడా వెళ్లాను. నిరంతర ప్రిపరేషన్‌తో సర్కారు కొలువు పెద్ద కష్టమేమీకాదు. కావాల్సిందల్లా సంకల్ప బలమే.ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నా. స్టడీ సర్కిల్ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహం మరవలేనిది. – నగేశ్, తాంసి

## సాఫ్ట్‌వేర్ టు సర్వీసెస్.. నందిని



ఎస్.నందిని

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుదగణ గోపాల్‌గౌడ్‌–అనిత దంపతుల కుమార్తె నందిని ఇటీవల విడుదలైన గ్రూప్‌–1, 2, 3 ఫలితాల్లో మంచి మార్కులతో సత్తా చాటారు. గ్రూప్‌–1లో 412 మార్కులు సాధించగా, గ్రూప్‌–2లో 1083 ర్యాంకు, గ్రూప్‌–3లో 841 ర్యాంకు సాధించారు. 2021లో బీటెక్ పూర్తి చేసిన ఈమె సుమారు రెండేళ్ల పాటు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం తల్లిదండ్రులు, సోదరుల ప్రోత్సాహంతో సర్వీసెస్ వైపు అడుగుపెట్టి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. 2023 నుంచి ప్రిపరేషన్ ప్రారంభించారు. తాజాగా గ్రూప్స్‌లో సత్తా చాటి కొలువు ఖాయం చేసుకున్నారు.

### సివిల్స్ లక్ష్యంగా ప్రిపరేషన్

బీసీ స్టడీ సర్కిల్‌లోని స్టడీహాల్‌కు నిత్యం వెళ్తూ అక్కడ నిర్వహించే మోడల్ టెస్టులు రాశాను. దీంతో పోటీ పరీక్షల సన్నద్ధతపై స్పష్టత వచ్చింది. ఇది పరీక్ష రాసే సమయంలో ఎంతో దోహద పడింది. అక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. నా ప్రిపరేషన్‌లో భాగంగా గ్రూప్‌–4 ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మావల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. సివిల్ సర్వీస్ ఆఫీసర్ కావడమే నా లక్ష్యం. ఆ దిశగా సన్నద్ధమవుతున్నా.

– ఎస్.నందిని, రవీంద్రనగర్, ఆదిలాబాద్

## సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు అనుగుణంగా ఉచిత శిక్షణ అందిస్తున్నాం. గతేడాది 151 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, ఈ ఏడాది గ్రూప్‌–1 ఫలితాల్లో 400కు పైగా మార్కులు సాధించిన వారు ఏడుగురు, గ్రూప్‌–2 ఫలితాల్లో 300కు పైగా మార్కులు సాధించిన వారు 17 మంది, గ్రూప్‌–3లో 250కి పైగా మార్కులు సాధించిన వారు ఐదుగురు ఉన్నారు. వీరిలో పది మందికి పైగా ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్నాం. అలాగే ప్రస్తుతం ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగ నియామకాల కోసం ఉచిత శిక్షణ అందిస్తున్నాం. జాబ్ క్యాలెండర్ ప్రకారం విడుదలయ్యే గ్రూప్స్, డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై నియామకాల కోసం సైతం ఉచిత శిక్షణ అందిస్తాం. లైబ్రరీ, స్టడీ హాల్ ఉదయం 6 గంటల రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. నిరుద్యోగులు మమ్మల్ని సంప్రదిస్తే వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తాం. నిరుద్యోగ అభ్యర్థులు స్టడీ సర్కిల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

## మెరుస్తున్న.. చంద్రశేఖర్



చంద్రశేఖర్

ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో తన ప్రతిభతో మెరుస్తున్నాడు జిల్లాలోని నార్నూర్ మండలం కొత్తపల్లి(హెచ్)కు చెందిన చాలూర్కర్ చంద్రశేఖర్. ఇప్పటికే మూడు కొలువులు సాధించాడు. ఓయూలో ఎంఏ (హిందీ) పూర్తి చేసిన ఈయన 2014లో వీఆర్వోగా ఎంపికయ్యాడు. అలాగే అదే ఏడాది పంచాయతీ కార్యదర్శిగా కూడా సెలక్ట్ అయ్యాడు. అయితే రెవెన్యూ శాఖను ఎంపిక చేసుకుని అంచెలంచెలుగా ఎదుగుతూ ఆర్ఐగా ఈ ఏడాది మార్చి 12 వరకు విధులు నిర్వహించాడు. తాజాగా జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో జెఎల్‌గా ఎంపిక అయ్యాడు. ప్రస్తుతం కుమురం భీం జిల్లా దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాడు.

### గ్రూప్‌-1 లక్ష్యం..

వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన తర్వాత కూడా నా ప్రిపరేషన్‌ను కొనసాగించా. 2016లో గ్రూప్‌–2 ఇంటర్వ్యూ వరకు వెళ్లా. వీలు చిక్కినప్పుడల్లా జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చి ఫ్యాకల్టీ గైడెన్స్ తీసుకున్నా. ఇటీవల విడుదలైన జేఎల్ ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యా. నా తదుపరి లక్ష్యం గ్రూప్‌–1. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహం మరువలేనిది. అలాగే బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగ అభ్యర్థుల పాలిట ఒక వరం.

– చాలూర్కర్ చంద్రశేఖర్, కొత్తపల్లి (హెచ్), నార్నూర్, ఆదిలాబాద్

## న్యూస్‌రీల్

### ట్రెయినీ కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు



మాల్వియాను సన్మానిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లాలో ఏడాది పాటు శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వీయాకు జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇందులో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ద్వితీయ భాష పరీక్ష నిర్వహించారు. జిల్లాలో 52 కేంద్రాల్లో 10,039 మంది విద్యార్థులకు గాను 23 మంది గైర్హాజరయ్యారు. 99.77 హాజరు శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆదిలా బాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గల జెడ్పీఎస్ఎస్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. అధికారులను అడిగి హాజరుశాతం వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, తహసీల్దార్ గోవింద్, తదితరులున్నారు.

# గ్రామాల్లో మళ్లీ 'రెవెన్యూ'

• వీఆర్వో స్థానంలో జీపీవో
• ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
• పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు అవకాశం

కైలాస్‌నగర్: గ్రామాల్లో రెవెన్యూ అధికారుల పాలన మళ్లీ అందుబాటులోకి రానుంది. ఆ శాఖలో గతంలో క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించిన వీఆర్వో, వీఆర్‌ఏల వ్యవస్థను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాము అధి కారంలోకి వస్తే తిరిగి పునరుద్ధరిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఓ అధికారి అందుబాటులో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా 10,954 గ్రామస్థాయి అధికారి పోస్టులను మంజూరు చేసింది. వాటికి అనుమతినిస్తూ ఆర్థికశాఖ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీఆర్‌వో పేరును గ్రామ పాలన అధికారి(జీపీవో)గా మార్పు చేసింది. గత ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏలను వారి ఆప్షన్ల ద్వారా తిరిగి రెవెన్యూ శాఖకు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం జిల్లాకు 508 జీపీవోలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అయితే ఈ పోస్టులను ఉగాది నుంచి అమల్లోకి తెస్తుందా లేక మరింత సమయం పడుతుందా అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. సర్కారు నిర్ణయంపై పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ పరిస్థితి..**

రెవెన్యూ శాఖకు సంబంధించి క్షేత్రస్థాయిలో వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థ గతంలో ఎంతో కీలకంగా వ్యవహరించేది. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, విచారణతోపాటు భూ వ్యవహారాలన్నింటిని వీఆర్వోలు పర్యవేక్షించేవారు. గ్రామాలకు సంబంధించి ఏ సమాచారమైనా వారి ద్వారానే ఉన్నతాధికారులకు చేరేది. ఇక వీఆర్‌ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు గ్రామాలను సందర్శించే అధికారుల వెంటే ఉండి సహకరించేవారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 సెప్టెంబర్‌లో వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేస్తూ అసెంబ్లీ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. రెండేళ్ల తర్వాత వీఆర్‌వోలుగా పనిచేస్తున్న వారందరినీ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. మరో ఏడాది పాటు వీఆర్‌ఏలను కొనసాగించిన ప్రభుత్వం ఆగస్టు 3, 2023న వారికి పేస్కేల్ అమలు చేస్తూ వారిని సైతం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. సర్కారు నిర్ణయంపై వీఆర్‌ఏల్లో హర్షం వ్యక్తమైనా వీఆర్వోలు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర శాఖల్లోకి వెళ్లినా అయిష్టంగానే పనిచేస్తూ రెవెన్యూపైనే మక్కువ కనబరిచారు.

**వీఆర్‌వో ఇక జీపీవో**

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు ఉండాలని నిర్ణయించింది. రద్దు చేసిన వీఆర్‌వో స్థానంలో గ్రామ పాలన అధికారి (జీపీవో)ని తీసుకురావాలని సంకల్పించింది. గత ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు రెవెన్యూలో చేరేందుకు ఆసక్తి ఉంటే ఆప్షన్ ఇవ్వాలని ఇటీవల పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో నాడు 105మంది వీఆర్వోలు ఇతర శాఖల్లో సర్దుబాటు కాగా అందులో 88 మంది తిరిగి రెవెన్యూకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వీఆర్‌ఏల విషయానికొస్తే 187 మందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారు. ఇందులో డిగ్రీ ఉన్నవారిని మాత్రమే రెవెన్యూకు ఆప్షన్ ఇవ్వాలని కోరారు. ఎక్కువ మంది ఇంటర్మీడియెట్ వారే ఉండటం, పేస్కేల్ కూడా ఉండటంతో చాలామంది ప్రస్తుతమున్న శాఖల్లోనే పనిచేయాలని నిర్ణయించుకున్నారు. మున్సిపల్ వార్డు ఆఫీసర్లుగా వెళ్లిన ఏడుగురు, నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు అయిన మరో 20మంది వీఆర్‌ఏలు మాత్రమే తిరిగి రెవెన్యూకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం వారి ఆప్షన్ల మేరకు నియామకాలు చేపట్టాలని భావించడంతో వీరంతా గ్రామ పాలన అధికారులుగా తిరిగి రెవెన్యూలో బాధ్యతలు నిర్వహించే అవకాశముంది. ఇలా మొత్తం 108 మంది సొంత శాఖకు తిరిగిరానుండగా.. జిల్లాలో రెవెన్యూ గ్రామాలు మాత్రం 503 ఉన్నాయి. మిగతా పోస్టులను ప్రభుత్వం ఏ విధంగా భర్తీ చేస్తుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

### ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

గత ప్రభుత్వం రద్దు చేసిన రెవెన్యూ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నాం. ఇతర శాఖల్లో బలవంతంగా సర్దుబాటు అయిన పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలను గ్రామ పాలన అధికారులుగా తిరిగి నియమించాలనే సర్కారు నిర్ణయం సంతోషదాయకం. రెవెన్యూలో దక్కిన గౌరవం ఇతర శాఖల్లో దక్కడం లేదు. రెండేళ్లుగా ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్నాం. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – పి.వామన్‌రావు, వీఆర్వోల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

# ప్రకృతివనాల్లో చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన పట్టణ ప్రకృతివనాలు పచ్చదనం ఆనవాళ్లే లేకుండా పోతున్న తీరును వివరిస్తూ 'వనం.. కళావిహీన' శీర్షికన ఈనెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. పట్టణ ప్రకృతివనాల శుభ్రత పనులను శనివారం ప్రారంభించారు. డిగ్రీ కళాశాల, డైట్ కళాశాల ఆవరణలోని ప్రకృతివనంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, విరిగిపడ్డ చెట్ల కొమ్మలను పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికిరణ్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.



చెత్తాచెదారం తొలగిస్తున్న బల్దియా కార్మికులు

# నీటిబొట్టుకూ ఓ లెక్క

• భూగర్భ జలాల వినియోగంపై చార్జీలు
• ఫ్లోమీటర్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు
• వ్యాపార, వాణిజ్య సంస్థలకు నోటీసులు
• క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు

| ఉమ్మడి జిల్లాలో 2024నుంచి 2025 ఫిబ్రవరి వరకు భూగర్భ జల శాఖ వివరాలు |
|---|
| జారీ చేసిన ఎన్‌వోసీలు 101 |
| రిజిస్ట్రేషన్ ఫీజులు(వాల్టా, పరిశ్రమ, మైనింగ్) రూ.15,12,448 |
| విధించిన జరిమానాలు రూ.1,65,000 |
| వసూలైన భూగర్భజల వినియోగ చార్జీలు రూ.3,02,64,788 |



దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన టెలిమీటర్‌తో కూడిన డిజిటల్ ఫ్లో మీటర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూగర్భ జలాలవిచ్చలవిడి వినియోగాన్ని భూగర్భ జల శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. గృహ, ప్రజావసరాలు మినహా వ్యాపార కేంద్రాల్లో ఇష్టారీతిన నీటి తోడకాన్ని తగ్గించేలా ప్రతీ నీటిబొట్టుకు లెక్కగడుతూ ఆ మేరకు చార్జీలు వసూలు చేస్తోంది. కమర్షియల్ కేంద్రాలైనకంపెనీలు, పరిశ్రమలనుంచి వినియోగచార్జీలు తీసుకునేలా 2023లోనే తీసుకొచ్చిన నూతన విధానాన్ని అమలుచేస్తూ ప్రతీ 1కేఎల్(వెయ్యి లీటర్లు)కు రూపాయి చొప్పున చార్జి వసూలు చేయనున్నారు. గతంలో వాల్టాచట్టం ప్రకారం ఆయా యాజమాన్యాలు నీటివాడకం కోసం ధ్రువీకరణ పత్రం(ఎన్‌వోసీ) ని మూడేళ్లకోసారి పునరుద్ధరణ చేసేవారు. కొత్త నిబంధనల ప్రకారం ఎంత నీరు వాడితే అంత చార్జీలు చేస్తూ ప్రతీనెల విద్యుత్ బిల్లు మాదిరిగానే నీటి బిల్లు ఆన్‌లైన్‌లో చెల్లించేలా సిద్ధం చేశారు. ప్రస్తుతం సింగరేణి, దేవాపూర్ సిమెంటు ఫ్యాక్టరీ వంటి సంస్థల్లో ఈ నిబంధనలు అమలు అవుతున్నాయి.

**ఫ్లో మీటర్లు బిగింపు..**

నీటిని వాడుతున్న ఆయ సంస్థలు, కంపెనీలు కచ్చితంగా భూగర్భ జలాల వాడకంపై డిజిటల్ ఫ్లో మీటర్‌తో కూడిన టెలిమీటర్‌కు అనుసంధానం చేసుకోవాలి. ఈ ఫ్లో మీటరు ప్రతీ ఆరు గంటలకు ఎంత నీటిని వాడారో లెక్కించి ఆన్‌లైన్‌లోనే వివరాలు పంపిస్తుంది. దీంతో ప్రతీ నెల ఆయా సంస్థలు జల వాడకానికి తగినట్లుగా చార్జీలు చెల్లించాలి. ప్రస్తుతం సింగరేణి బొగ్గు గనులు, ఓపెన్ కాస్టుల్లో అమలవుతోంది. వీటితోపాటు సిమెంటు, ఇతర మైనింగ్ కంపెనీలు, నీరు అధికంగా వినియోగిస్తున్న సంస్థలకు ఆయా జిల్లాల భూగర్భ జల అధికారులు వెళ్లి తనిఖీ చేస్తూ ఫ్లో మీటర్లను బిగించుకునేలా చూస్తున్నారు. కొత్త విధానంపై ఇంకా చాలా మందికి అవగాహన లేకపోవడం, డబ్బులు కట్టాల్సి వస్తుందని కొన్ని చోట్ల స్పందించడం లేదు.

**వాడకమున్నా వసూళ్లు లేవు**

గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు తాగునీటి ప్లాంట్లు, కంపెనీలు, పరిశ్రమలు, ఖనిజ పరిశ్రమలు అనేకం ఉన్నాయి. యాజమాన్యాలు తమ బోర్‌వెల్స్‌ను రిజిస్ట్రేషన్ చేసుకుని ఫ్లో మీటర్లు అమర్చుకోవాల్సి ఉంది. కానీ చాలాచోట్ల వ్యాపారులు ముందుకు రావడం లేదు. అనధికారికంగానూ బోర్‌వెల్స్, పంపుసెట్లు, వాగులు, వంకలు, చెరువుల నుంచి నీటిని తోడేస్తున్నారు. ఎండాకాలంలో ఈ వాడకం తీవ్రంగా ఉంటుంది. ఒక్కో సంస్థ నిత్యం వేలాది లీటర్ల నీటిని వినియోగిస్తున్నా లెక్కాపత్రం లేకపోవడంతోపాటు వినియోగంపైనా అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అలాంటి చోట్ల అధికారులు వెళ్లి మొదట నోటీసులు ఇస్తున్నారు. కొంత గడువు ఇచ్చాక జరిమానా విధిస్తున్నారు. చాలా చోట్ల యాజమన్యాలు ఈ నోటీసులను సైతం పట్టించుకోవడం లేదు.

## క్లుప్తంగా

### ట్రాలీ ఆటో బోల్తా



బోల్తాపడిన ట్రాలీ ఆటో

**తాంసి(బోథ్):** మండలంలోని వడ్డాడి సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై శనివారం ఉదయం ఫర్నీచర్ సామగ్రి లోడ్ చేసుకుని వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడింది. మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో వాహన డ్రైవర్ ఫారుఖ్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

### ఇద్దరు అరెస్ట్



అరెస్ట్ చూపిస్తున్న సీఐ కుమారస్వామి

**భీమిని:** మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం జరిగిన కుటుంబ తగాదాల్లో చదువుల లక్ష్మణ్ మృతి చెందాడు. విచారణ చేపట్టిన పోలీసులు మృతికి కారకులైన పార్వతి రాజేశం, పార్వతి అనిల్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కుమారస్వామి, భీమిని ఎస్సై గంగారాం తెలిపారు.

### పత్తి విత్తనాలు పట్టివేత



విత్తనాలు, నిందితుడితో పోలీసులు

**భీమిని:** మండలంలోని వడాలలో నిషేధిత పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన జాడి పీరన్న నివాసంలో శనివారం తనిఖీలు నిర్వహించగా వాటర్ క్యాన్‌లలో నిల్వ ఉంచిన 20 కిలోల పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### బాలునిపై కోతుల దాడి



కోతుల దాడిలో గాయపడిన బాలుడు

**ఖానాపూర్:** పట్టణంలోని అర్బత్‌కాలనీలో బాలునిపై కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. కాలనీకి చెందిన ఉమర్ శనివారం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వెనక నుంచి వచ్చిన కోతులు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాలున్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యంకోసం నిర్మల్‌కు రెఫర్ చేశారు. కోతులను నిర్మూలించడంలో అధికారుల వైఫల్యం కారణంగా నానా ఇక్కట్లు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

# ‘శివపెల్లి’లో పురాతన విగ్రహాలు

- పూజలు చేస్తున్న ఆదివాసీలు
- చోరీకి గురైన పాండవుల విగ్రహాలు
- సంరక్షించాలని కోరుతున్న స్థానికులు



శివపెల్లి అటవీ ప్రాంతంలోని పురాతన విగ్రహాలు



గణపతి విగ్రహం



ఏనుగుపై కత్తితో ఉన్న విగ్రహం

**చింతలమానెపల్లి:** చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీ శివపెల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం. దట్టమైన అడవిలోని పాండవుల కుంటలో వందల ఏళ్ల నుంచి విగ్రహాలు పడి ఉన్నాయి. ఎవరు ప్రతిష్ఠించారో తెలియదు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో సరైన రహదారి లేని కారణంగా గుర్తింపు లేకుండా పడి ఉన్నాయి. సమీప గ్రామాల ఆదివాసీలు మాత్రం తమ విశ్వాసాలతో మొక్కుకుంటున్నారు. కానీ వాటికి రక్షణ మాత్రం లేదు.

**ప్రత్యేకంగా కనిపించే విగ్రహాలు**

ఈ విగ్రహాలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న విగ్రహాలలో ఒకటి గణపతి దేవుడిది కాగా మిగతావి యుద్ధరీతులను తెలియజేసేవిలా ఉన్నాయి. ఒక విగ్రహం విల్లు ఎక్కుపెట్టి యుద్ధంలో పాల్గొన్నట్లుగా ఉంది. మరో విగ్రహం ఏనుగుపై ఎక్కి కత్తితో యుద్ధం చేస్తున్న వీరుడు లేదా వీరనారిలా ఉంది. మరో విగ్రహం తలవరకు శిథిలమై కనిపిస్తోంది. ఇక్కడి విగ్రహాలు పాండవుల విగ్రహాలని, ప్రాచీన కాలంలో ఈ ప్రాంతంలో పాండవులు నివాసం ఉన్నారని స్థానికంగా విశ్వాసం ఉంది. వారు ఇక్కడ నివాసం ఉన్నందుకు గుర్తుగా ఇక్కడి ఆదివాసీలు వారిని పూజిస్తారని స్థానికులు తెలిపారు. ఇక్కడ ఉన్న విగ్రహాల్లోంచి మూడింటిని దేవతలుగా భావించి కొన్నేళ్ల క్రితం దొంగిలించారని గ్రామ పెద్ద మడె గిర్మాజీ పటేల్ తెలిపాడు.

**ఒకప్పటి నివాస ప్రాంతం**

ఈ ప్రాంతంలో ఒకప్పుడు నక్కలగెర్రె, ఊట్ల, చింతలగెర్రె అనే గ్రామాలు ఉండేవని పూర్వీకులు చెప్పినట్లు సమీప గ్రామాల పెద్దలు పేర్కొంటున్నారు. సుమారుగా 300 సంవత్సరాల క్రితం ఇక్కడ మానవ నివాసాలు ఉండేవని, ఇక్కడ నివసించిన ప్రజలు ప్రాణహిత నది ఉధృతి కారణంగా లేదా మరేదైనా రోగాల కారణంగా వెళ్లిపోయి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మానవుల నివాసాలు ఉన్నట్లు ఇళ్ళపెంకులు, మట్టి పాత్రల అవశేషాలు కనిపిస్తున్నాయని ఇవే ఆధారాలుగా పేర్కొంటున్నారు.

**చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి**

శివపెల్లి అటవీ ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో ఉన్న పురాతన విగ్రహాల రక్షణకు చర్యలు చేపట్టాలనే డిమాండ్ స్థానికుల నుండి వ్యక్తమవుతోంది. ఇక్కడ ఉన్న విగ్రహాల్లో దేవుళ్లతో పాటు యుద్ధరీతిని తెలిపేవి కూడా ఉన్నాయి. ఇవి రాతితో చేసి ఉన్నా అప్పటి కాలంలో యుద్ధ విధానాన్ని తెలిపేవిగా ఉన్నాయి. ఇప్పటికే పలు విగ్రహాలు చోరీకి గురయ్యాయి. ఇలాంటి చారిత్రక ఆనవాళ్లను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పూజలు చేస్తున్నాం**



స్థానిక ఆదివాసీ గ్రామాల ప్రజలు ఇక్కడి విగ్రహాలకు పూజలు చేస్తున్నారు. నా చిన్నతనంలో ప్రాణహిత నదికి భారీగా వరదలు వచ్చినపుడు గూడెం, బూరుగూడ, కోయపెల్లి గ్రామాల ప్రజలు ఇక్కడి కొండ వద్దకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇక్కడ ఉన్న విగ్రహాలు ప్రజల విశ్వాసాలకు సంబంధించినవి. వీటిని కాపాడాలని కోరుతున్నాం

– మడె గిర్మాజీ, ఆదివాసీ గ్రామ పటేల్, శివపెల్లి

# కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

- పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట
- అధికారుల తీరుపై మండిపడిన ఆదివాసీలు



పోలీసులు, ఆదివాసీల మధ్య తోపులాట

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ పట్టణంలోని సర్వేనెంబర్ 72లో స్థిర నివాసముంటున్న ఆదివాసీలకు ఇంటిపట్టాలు ఇవ్వడంతో పాటు తాగునీరు, కరెంట్, విద్య, వైద్యం, రోడ్డు వంటి సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌తో శనివారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. భారీగా హాజరైన ఆదివాసీలు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అక్కడి ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఇరువురి మధ్య తోపులాట జరుగడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఆర్డీవో వినోద్ కుమార్ అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఏళ్లుగా తమ చుట్టూ తిరుగుతున్నామని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో దివ్యాదేవరాజన్, చిన్నారెడ్డిలను కలిసి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈకి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా వాటిని ఆయన సీఎండీకి పంపించలేదన్నారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న ఆ లంబాడ అధికారిని తక్షణమే ఆ పోస్టు నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలనైనా పరిష్కారించాలని లేదంటే తమను పోలీసులచే కాల్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉండడంతో ఆర్డీవో కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ మాట్లాడుతూ కొమురంభీం కాలనీలో గుడిసెలు వేసుకుని ఏళ్లుగా నివసిస్తున్న తమను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులంతా కుమ్మక్కై అక్కడి నుంచి వెళ్లగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని ప్రభుత్వ భూములన్నింటిని కబ్జా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి క్లోం భూమారెడ్డితో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులన్నింటిని మార్చివేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అంతా క్లోం భూమారెడ్డితో కలిసి వెయ్యి కోట్ల భూమిని పంచుకోవాలనే ఉద్దేశంతో తమకు ఆ భూమి దక్కకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఆందోళన నేపథ్యంలో డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, సాయుధ పోలీసు బలగాలతో పకడ్బందీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆర్కే 5 గనిలో కూలిన పైకప్పు

- తప్పిన పెను ప్రమాదం
- ధ్వంసమైన ఎస్‌డీఎల్ యంత్రం

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిలో పెను ప్రమాదం తప్పింది. గనిలోని 3వ సీమ్, పదహారో లెవల్‌లో శనివారం ఫస్ట్‌షిఫ్ట్‌లో కోల్‌ఫిల్లింగ్ పనులు నడుస్తున్నాయి. ఎస్ ఎస్ 15 నంబర్ గల ఎస్‌డీఎల్ యంత్రం టబ్బుల్లో బొగ్గు నింపుతుండగా టబ్బులు అయిపోవడంతో ఖాళీ టబ్బులను పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా పైకప్పు కూలింది. దీంతో యంత్రం పూర్తిగా శిథిలాల కింద చిక్కుకుపోయింది. ఆ సమయంలో ఆపరేటర్ బండి దిగి ఉండటం, అదే సమయంలో మిగితా కార్మికులెవ రూ అక్కడ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పిందని కార్మికులు తెలిపారు. సుమారు 5 మీటర్ల మందం గల బండ కూలడంతో ఎస్‌డీఎల్ యంత్రం పూర్తిగా ధ్వంసమైంది. గ్రూప్ ఏజెంట్, గని మేనేజర్, ఇతర అధికారులు ప్రమాదస్థలిని సందర్శించారు. శిథిలాల కిందఉన్న ఎస్‌డీఎల్ యంత్రాన్ని తీసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పెద్దయెత్తున బండ కూలడంతో యంత్రం పనిచేయలేనంతగా పూర్తిగా ధ్వంసమై ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇదే తరహాలో 4వ సీమ్‌లో ఫేస్‌లో బండ కూలిందని, ఇక్కడ ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగలేదని తెలిసింది. దీంతోపాటు కొద్దిరోజుల క్రితం ఇదే గనిలో 5 సీమ్‌లో జీడీకే 7 ఎల్‌ఈపీ తరహా నీటి ప్రమాద ఘటన తప్పిందని కార్మికులు పేర్కొంటున్నారు. వరుస ప్రమాదాలపై కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గనిలో రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ ప్రమాదం జరిగిన విషయాన్ని బయటకు పొక్కకుండా అధికారులు చాలా గోప్యంగా ఉంచారు.

# ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

**ఆదిలాబాద్‌రూరల్:** ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బంగారుగూడకు చెందిన దుర్వ రవి (50)కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు తెలిసింది. మద్యం మానేయడానికి గతంలో రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడకూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఆత్మహత్య చేసుకున్న విషయం వాస్తవమేనని, మృతుని కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు రాలేదన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్ కుమార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నవీన్ కుమార్

**ఆదిలాబాద్‌టౌన్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో పర్యావరణ సమస్యలు, దాని నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నారాయణ క్యాన్సర్ వ్యాధి కారకాలు, మనం తాగే నీటివనరుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటేశ్, కోటయ్య, అనిత, చంద్రకాంత్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టిసావర్‌గాం శివారులో బైక్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఎర్రం దేవేందర్ మావల సమీపంలోని ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై రాంపూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో దేవేందర్‌కు గాయాలయ్యాయి. బాధితుని బావమరిది నాగుల తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### అబార్షన్ కేసులో పీఎంపీ రిమాండ్

**గుడిహత్నూర్:** యువతి అబార్షన్ కేసులో పీఎంపీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ తెలిపారు. మండలంలోని గురుజ గ్రామంలో ఈ నెల 11న వాగులో పసికందు మృతదేహం లభించిన విషయం తెలిసిందే. 12న ‘అమ్మా నీ తప్పుకు నన్ను చంపేశావా?’ అనే శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాహుల్, కిరణ్ అనే ఇద్దరు యువకులను, మన్నూర్‌కు చెందిన పీఎంపీ సూర్యవంశి దిలీప్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అర్హతకు మించి వైద్యం అందించి బాధితురాలు అస్వస్థతకు గురై అబార్షన్ కావడానికి కారణమైనట్లు గుర్తించిన పోలీసులు పీఎంపీ సూర్యవంశీ దిలీప్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### కలమడుగు పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ



ఉపాధ్యాయులతో ఆర్జేడీ సత్యనారాయణ

**జన్నారం:** మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో మాట్లాడి రాబోయే విద్యాసంవత్సరం పదో తరగతిలో ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే ‘పది’లో మంచి ఫలితాలు సాధిస్తామన్నారు. ఉపాధ్యాయ బృందం యూనిఫాంలో ఉండడం చూసి అభినందించారు.

### నేడు రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**మంచిర్యాలటౌన్:** జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాలులో ఆదివారం పూర్వ ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోచన్న, ప్రహ్లాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర నాయకులతో పాటు, పూర్వ ఆదిలాబాద్ జిల్లా నాయకులు హాజరవుతున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### మట్కా నిర్వాహకుల అరెస్టు

**ఆదిలాబాద్‌రూరల్:** ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదివేనగర్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేయగా మరొకరు పరారైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించగా మట్కా నిర్వహిస్తున్న జుంగ్రే ప్రవీణ్, శివను అరెస్టు చేయగా లకన్ పరారైనట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,250 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేశామన్నారు.

### కంటైనర్ సీజ్

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో 33 ఎద్దులను కంటైనర్‌లో తరలించేందుకు సిద్ధమైన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. కర్ణాటకకు చెందిన అఫ్రోజ్, సాధిక్ బాషా కంటైనర్‌లో ఎద్దులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లుగా సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకుని కంటైనర్‌ను సీజ్ చేసి ఎద్దులను గుడిహత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

### దొంగ అరెస్ట్

**కౌటాల(కాగజ్‌నగర్):** కాగజ్‌నగర్ పట్టణంలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బాలజీనగర్‌లో ఇటీవల మూడు చోరీలు చోటు చేసుకోగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సీసీటీవీ పుటేజీ, సాంకేతిక ఆధారాలతో జంజిరాల ప్రదీప్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.8లక్షల విలువైన 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, సెల్‌ఫోన్, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# కార్మిక హక్కుల సాధనకు రాజీలేని పోరాటం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

**కాసిపేట(బెల్లంపల్లి):** కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై స్ట్రక్చర్ సమావేశంలో చర్చించామని, దశల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశం, మైనింగ్ అండ్ టెక్నికల్ విభాగంలో పనిచేసిన ఉద్యోగులకు సూటబుల్ జాబ్ ఇప్పించామన్నారు. కొత్తగా వచ్చే ఉద్యోగుల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచామని, సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఏఐటీయూసీలో చేరిన 27 మంది కార్మికులకు కండువాలు వేసి యూనియన్‌లోకి ఆహ్వానించారు. పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, బొద్దుల వెంకటేశ్, నర్సయ్య, సుభాష్ చంద్రబోస్, రాజ్‌కుమార్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీపీపీలో కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

**జైపూర్:** సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రెటరీ విక్రమ్, వైస్ ప్రెసిడెంట్లు చిప్పకుర్తి సంపత్, సాయి కృష్ణారెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సత్యనారాయణచారి, తదితరులు పాల్గొన్నారు.

# ‘దళితుల భవిష్యత్‌ను దెబ్బతీసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

**పాతమంచిర్యాల:** ఎస్సీ వర్గీకరణపేరుతో దళితుల భవిష్యత్‌ను దెబ్బతీసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని దళిత బహుజన పార్టీ జాతీయ కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి కృష్ణ స్వరూప్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ, సంక్షేమ హక్కులను ధ్వంసం చేసే విధంగా నరేంద్ర మోదీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలిస్తామని, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు విడుదల చేసి వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. 26 మాల ఉపకులాల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం దళితులను విభజించి మాలలకు వెన్నుపోటు పొడిచారన్నారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ఇన్‌చార్జీలు ఎం.రాంచందర్, సీహెచ్ కరుణాకర్, నాయకులు పిట్ల ఈశ్వర్, పి.రాజలింగం, నీరటి శంకర్, ఎం.అర్చన, గవ్వల శ్రీకాంత్, పులి రాజారాం, లింగాల జలపతి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం, ప్రధాని చిత్రపటాలు దహనం**

ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటి, దళిత బహుజన పార్టీ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు.

# ఆర్జీయూకేటీలో ఎస్‌డీజీ సమ్మిట్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

**బాసర:** బాసర ఆర్జీయూకేటీలో శనివారం ఎస్‌డీజీ సమ్మిట్ 2025 నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్‌సాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిపుణులు, విధాన నిర్మాతలు ఆలోచనాధారులను సుస్థిర అభివృద్ధి కోసం నవీన పరిష్కారాలు అన్వేషించడానికి ఆహ్వానించింది. సమ్మిట్‌లో ప్యానెల్ చర్చలు, కీ నోట్ సెషన్లు, వైస్ చాన్స్‌లర్‌తో ఫైర్‌సైడ్ చాట్ వర్చువల్ సెషన్ ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేటెడ్ డాక్టర్ మహేష్, డాక్టర్ విటల్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### దగ్ధమైన ఎలక్ట్రికల్ బైక్

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓ ఎలక్ట్రికల్ బైక్ పూర్తిగా దగ్ధమైంది. కాలనీకి చెందిన రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి హనుమాండ్లు ఎలక్ట్రికల్ బైక్ చార్జింగ్ పెట్టి ఉంచగా ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి కేకలు వేయడంతో పై అంతస్తులో ఉన్న సదరు వ్యక్తి వచ్చి చూసేసరికి వాహనం మంటల్లో కాలుతోంది. అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు వచ్చే సరికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.